# ముళ్ళ కిరీటం

"సరేనండి, ఇక మేం సెలవు తీసుకుంటాం," అని అంటూ కణ్ణుసామి లేచాడు. అతనితోబాటు అక్కడ గుమిగూడిన జనమూ నిలబడ్డారు.

"నేను వస్తాను సార్!"

"నేను వస్తాను సార్!"

"సార్, నేనూ వస్తాను సార్!"

ఒక పిల్లవాడు అతని దగ్గరవచ్చి, వొంగి, అతని కాళ్ళని ముట్టుకొని, తన కళ్ళలో ఒత్తుకున్నాడు; గభీమని తన కాళ్ళను అనుకూలసామి లాగ్గున్నారు.

"అరేరే, ఇదేంటిరా?"

"చెయ్యనీ సార్! మీలాంటి పెద్దలు వీళ్ళకి మరెక్కడ దొరుకుతారు? బాగా వర్ధిల్లమని దీవించండి," అన్నాడు కణ్ణుసామి.

ఆ పిల్లవాడిలాగే తక్కిన కుఱ్ఱవాళ్ళూ అతని కాళ్ళని ముట్టుకొని కళ్ళలో ఒత్తుకున్నారు.

అనుకూలసామికి తత్తరపాటు కలిగింది.

"ఎందుకు ఇవన్నీ . . . " అని అతను చికాకుతో ఏదో అనబోయారు కాని అంతలో కణ్ణుసామి జోక్యం చేసుకున్నాడు:

"అనుకూలసామి, మీరే అసలైన క్రైస్తవులు. నేను ముఖస్తుతికి అనడం లేదు. ముప్ఫైఆరు సంవత్సరాలు బెత్తం వాడకుండా, నిష్ఠురంగా ఒక మాటా అనకుండా, మాష్టరుగారుగా ఉద్యోగం చేసిన దేవుడికి మొక్కుకుంటే తప్పా?"

"అలాగేం అనకండి."

"నేనుమాత్రం కాదు, ఊరంతా చెప్తోంది. నేనూ బజారు వీధిలో వింటున్నదే చెప్తున్నాను. కన్నపిల్లల్ని ఎప్పుడైనా ఒకసారి తల్లిదండ్రులు తప్పక వాయించుతారు, లేక తిట్టుతారు. మీదగ్గఱ అవేం లేవు! చెప్పండి, ఎవరలాగ ఉండగలరు?"

కణ్ణుసామి మాటాడుతున్నప్పుడు పిల్లకాయలు వొంగి మాష్టరుగారుకి మొక్కుతున్నారు; అతనినోటినుంచి ఏ మాటా రాలేదు.

“సరే, నేను వస్తానండి.”

“మంచిది,” అని శ్రమతో నోరు విప్పి అతనికి వీడ్కోలు చెప్పారు.

“మాకూ సెలవివ్వండి,” అని పెరడులో ఇంతవరకూ నిలబడియున్న నాదస్వర విద్వాంసుడు అనుకూలసామిని కోరుకున్నాడు; సరేనని అతను తలూపారు.

అందరూ ద్వారంనుండి నిష్క్రమించడానికి రెండు నిమిషాలు పట్టింది.

ఇద్దరు ముగ్గురు పిల్లకాయలు గుసగుసలని తమలో ఏమో మాటాడుకొని “సార్, ఈ రెండు లైట్లు ఇక్కడేవుండనీ. మేం రేపు పొద్దన్నే వచ్చి తీసుకుంటాం,” అని చెప్పి జారుకున్నారు.

అందరినీ సాగనంపి అతను మళ్ళీ ఇంట్లోకి ప్రవేశించగానే చుట్టూ శూన్యం కప్పుకున్నట్టు అనిపించింది. ఆ శూన్యం, గుండెని పీకే ఆకాంక్ష అనుకూలసామి ఇందకుముందు అనుభవించివున్నారు; పది సంవత్సరాలముందు లూయిసాని అల్లుడిగారింటిలో దిగబెట్టి తిరిగివచ్చినప్పుడూ ఇదే శూన్యం, ఇదే ఆకాంక్ష.

బుస్సుమని ఆ రెండు పెట్రోమాక్స్ దీపాలు శూన్యంని నింపాయి.

అతన్ని అందరూ ఒంటరిగాచేసి వెళ్లిపోయారు. రేపు బుధవారం. కాని అతనికి అది శనివారం, ఆదివారం కిందే లెక్క. ఆ తరువాత వచ్చే అన్ని రోజులూ శనివారం, ఆదివారాలే. ఇక స్కూలుకి వెళ్లే ప్రమేయం లేదు. అతనికి అరవై నిండాయి; పదవీ విరమణ వచ్చేసింది.

ఉయ్యాలమీద అతను ఎక్కి కూర్చున్నారు. అతని పక్కనే ఫ్రేం వేసిన ఏడెనిమిది యోగ్యతా పత్రాలు; ఒక వెండి పళ్ళెం; ఒక కలం; అంగడిలో దాని వెల నాలుగు రూపాయలు; కాని ఇక్కడ దానికి వెల లేదు: నాలుగు లక్షలు, నాలుగు కోట్లు అని చెప్తే అవీ పనికిరాని మాటలే: రెండూ ఒకటే అనే పొరబాటు వచ్చేస్తుంది.

ఆ పక్కనే ముడుచుకున్న నాలుగైదు గులాబీ పూలదండలు . . .

ఉయ్యాలగొలుసుని పట్టుకొని అతని భార్య మహిమై అతని ఎదుట నిలబడి ఉంది. ఆవిడ నోటినుంచి ఏ మాటా రాలేదు; అతన్ని చూస్తూనేవుంది. అతనికి వచ్చిన

గౌరవం, సన్మానాలు అన్నీ తనకీ వచ్చినట్టు ఒక చూపు. ఒక నిమిషం అతన్ని చూస్తూనే ఆహ్లాదపడింది; గభీమని ద్వారందగ్గఱకి వెళ్లి, తలుపు మూసేసి, తిరిగవచ్చి, పూలదండలు ఒక్కొక్కటిగా చెయిలో తీసుకొని, భర్త మెడలో వేసి, అతని రెండు భుజాలు నొక్కిపట్టుకొని అతన్ని చూస్తూనే మాటాడింది.

"మీరూ నన్నెప్పుడూ కొట్టలేదు, తిట్టలేదు!" అని అంటూ అతని ఛాతీమీద వాలింది.

"మనం జీవించేది కొన్నిరోజులేకదా, వర్షాకాలంలో చీమలు వచ్చి కప్పుకున్నట్లు? మరెందుకు కొట్టడం, తిట్టడం అన్నీ? మొత్తుతే మాత్రం మనుషులు సరిదిద్దుకుంటారా?"

"రాక్షసుడిలాగ మొత్తకపోయినా మగాడిగా ఒక రోజైనా కోపం రావొద్దూ?"

"కోపం రాదని ఎవరన్నారు?"

"మరి ఆ కోపం బయటకి చూపవద్దూ?"

"అందుకేగా నీకు, పాలది, పనిమనిషి, దొరికారు? నేనందుకు కోప్పడాలి?"

"బడిపంతులుగా ఉద్యోగం చేస్తే పిల్లల్ని, కొట్టకుండా. తిట్టకుండా ఎలా సాధ్యం?"

"నాకెలాగో సాధ్యమైందే!"

మహిమై భర్తని మళ్ళీ ఒకసారి నిబ్బరంగా చూస్తూ, అతని మీసాన్ని గుంజుతూ "కాఫీ తాగుతారా?" అని అడిగింది.

ఆవిడ వంటగదిలోకి వెళ్ళింది. అప్పుడే అతనికి తన ప్రాణం వేరే ఒక దేహంలో ప్రవేశించినట్టు ఒక భావన కలిగింది. తలెత్తి గోడని చూసారు; ముళ్ళకిరీటంతో ఆ మొహంలో కారుణ్యం ధారధారగా కారుతోంది. నాలుగైదు పఠాలు తరువాత ఇంకొక పఠంలో అదే మొహం ఒక మేకపిల్లని ముద్దాడుతోంది.

కణ్ణుసామి చెప్పినది నిజం; ఈ ముప్పైయ్యారు సంవత్సరాల్లో అతను ఒక పిల్లవాడినీ కొట్టలేదు, తిట్టలేదు.

అతని స్వభావమే అలాగ. లూయిసా పుట్టి, స్కూల్లో చేరి, దానికి ఆరేళ్ళ వయసులో ఏదో అల్లరి చేసిందని మాష్టరుగారు దాన్ని స్కేలుతో వాయించారు. అది వేసవికాలం, లూయిసా చెమటపొక్కులతో బాధ పడుతోంది. ఆ స్కేలు దెబ్బతో ఆ

అమ్మాయి పడిన చిత్రవధ, ఆ తండ్రి అనుభవించిన బాధ, ఎలా వర్ణించడం? ఆ రోజు అనుకూలసామి తన స్వభావాన్ని దృఢసంకల్పంగా పూనుకున్నారు; అందరూ చేసిన తప్పులకి తన ప్రాణం పరిహారంగా ఇచ్చిన ఆ ఏసుక్రీస్తుని గుర్తుచేసుకున్నారు. అవును, ఆ ప్రభువు అన్నితరాలకోసం ఆ త్యాగం చేసాడు.

ఎలాగో ఈ ముప్పైయారు సంవత్సరాలూ ఆ సంకల్పం అడ్డం లేకుండా నెరవేర్చడమైంది; లేకపోతే పదవీ విరమణ చేసిన మాష్టరుగారిని ఇంత కోలాహలంతో అతనింటివరకూవచ్చి ఎందుకు వీడ్కోలు చెప్పాలి?

నిన్న స్కూల్లో జరిగిన వీడ్కోలు, పార్టీ చాలదని అతని క్లాసులోనున్న నలభై శిష్యులకి అనిపించివుండాలి. అందుకే వాళ్ళు ఇవాళ ఈ వేడుకకి ఏర్పాటు చేసారు; దండలుదండలుగా అతని మెడలో వేసారు; వరుసవరుసగా యోగ్యతాపత్రాలు చదివారు.

గభీమని వసారాలో నాదస్వరం, దానితోబాటు ఢోలూ వినిపించాయి.

“ఏమిటయ్యా ఇదంతా?”

“మీకు కాకపోతే మరెవ్వరికి?” అని అంటూ ఆరుముగం అతనికి స్వాగతం చెప్పాడు. వాడికి ఇరవైమూడేళ్ళు నిండాయి. కాని చదువు ఇంకా పూర్తవలేదు. చాలా రోజులుగా చదువుతున్నాడు. కాని మంచి లోకపరిచయముంది. మారుమాటనక అనుకూలసామి సరేనని ఒప్పుకున్నారు. లేకపోతే వాడు అతని సహోద్యులగురించి ఏమైనా వాయించుతాడనే భయం అయనికి కలిగింది.

అతను ఊహించినట్టే వాడు ఓ నాలుగుమాటలు అనేసాడు!

“మాకన్నీ తెలుసు సార్! ‘నేను రిటైరవుతున్నాను, నాకోసం నిధి వసూలు చెయ్యండి!’ అని మీరెవరినీ అడగలేదు. మేం నకలీనగలు తాకట్టుపెట్టి డబ్బు పోగుచెయ్యలేదు! ఎక్కడా అప్పు అడగలేదు!”

“సరేలే, నాకు దాహమేస్తుంది. వెళ్ళి నీళ్ళు తీసుకురా!” అని చెప్పి వాడి సంభాషణ మళ్ళించారు.

వాడి నోరు మూయడమైంది, కాని వాడు చెప్పినదంతా నిజం. తనేం తప్పు చెయ్యలేదు; ఎంత కోపంవచ్చినా ఎవరినీ వాయించలేదు; అప్పులు చేసి ఎవరినీ ఎగ్గొట్టలేదు; అతనివలన ఎవరికీ ఎటువంటి బాధా లేదు.

అతనిలాగే నారాయణయ్యరుకూడా; చిన్న కుటుంబం, ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. కాని మనిషికి ఊరంతా అప్పులు; బట్టలదుకాణంతో ఆరంభించి వీధిలో కొత్తమరి కొన్నాలన్నా అదే పాట. ఐనాకూడా నారాయణయ్యరు మరేంచెయ్యక ఊరుకున్నారా? లేదు. మద్రాసులో విద్యాప్రణాళిక బోర్డులో పనిచేసే అతని చుట్టపువాడు అతనికి "ఈ సంవత్సరం మిమ్మల్ని పరీక్షకుడుగా నియమించబోతున్నారు, ఇంకా రెండు వారాల్లో మీకు ఆర్డరు వస్తుంది," అని రాసాడు. ఆ ఉత్తరం చూపించే అతను ఇరవైమంది దగ్గఱ యాభై, డెబ్భై అని అప్పులు తీసుకున్నారు. ఇంతకీ అతనిక రాబోయే కూలి రెండువందలు; ఆఖరికి అదీ అబద్ధంగా ఐపోయింది. షరాబ్ దుకాణం నాయుడు నారాయణయ్యరుతో ఎదురుపడి, దెబ్బలాడి, అతని సైకిలు లాగ్గున్నాడు. మోసం చేసినందుకు శిక్ష! నారాయణయ్యరు వలన బడిపంతులందరికీ అవమానం!

బాంకు ఏజంటు అయ్యంగారిని అంత సులభంగా దగా చెయ్యడం సాధ్యమా? చల్లలో వెన్న తీసే మనిషతను; అతనిదగ్గఱ ఈ సామినాధన్ తన చలాకీతనం చూపాలని పూనుకున్నాడు; అతనిచ్చిన బంగారు గొలుసుని తూచి, అయ్యంగారు మూడువందలు రూపాయలు అతనికి అప్పుగా ఇచ్చారు. దానితో సామినాధన్ వూరికే వుంటే సరిపోను. కాని రెండు వారాలతరువాత ఇంకొక గొలుసుతో అయ్యంగారిని కలుసుకున్నాడు. దానికికూడా గీటురాయితో పరీక్ష చెయ్యకుండా అప్పు ఇవ్వాలని శాస్త్రం ఉందా? అయ్యంగారు నవ్వుతూనే "పంతులుగారు, స్కూల్లో పిల్లవాడు ఏదైనా ప్రశ్న అడుగుతే 'ఎందుకురా లొడలొడమని వాగుతావ్, కూర్చో!' అని కేకపెట్టి మన అజ్ఞానం దాచుకోవచ్చు. కాని బజారువీధిలో అది వీలవుతుందా? నాకు సరిగ్గా అర్థం కావటం లేదు. కొంచెం ఆగండి. నేను కంసాలివాడిని పిలుస్తాను,' అని అంటూ బయటికి వెళ్ళారట. సామినాధన్ హడలెత్తుకున్నారు. ఇంతలో కంసాలివాడు, అతనితోబాటు హెడ్ కానిస్టేబులు వచ్చేసారు. ఆ సాక్షులతో ఖజానా తెరిచి చూడగానే

ఇంతకుముందు సామినాథన్ తాకట్టుపెట్టిన గొలుసు 'నేనంతా ఇత్తడిమయం!" అని ముఖం చిట్లించుకొని కనిపించిందట! అప్పుడుకూడా అయ్యంగారు బడిపంతుల కులానికి మర్యాద ఇవ్వదలచుకున్నారు. మూడో మనిషికి తెలియకుండా సామినాథన్ తన తోటని అయ్యంగారు దావా చేసుకున్నట్టు పత్రం రాసినతరువాత అతన్ని అలాగే వదిలేసారు. మంచి వేళ, ఆ వచ్చిన హెడ్ కానిస్టేబులు పోలీసు ఉడుపుతో కాక పంచెతో వచ్చారు; ఏ పెద్ద జనసమూహమూ లేదు; ఊరులో ఎవ్వరూ నవ్వలేదు.

ఇంకా నలుగురైదుగురు అతనికి జ్ఞాపకం వచ్చారు.

"నేనిప్పుడు రిటైరయి పోయాను . . . మరి తినడానికి సరైన తిండి దొరక్కపోతే? నీకు తెలుసా? . . . ఆ రోజుల్లో మేం మా గురువుగారికి నిధి జమ చేసేవాళ్ళం!" అని అంటూ రామలింగం బయలుదేరాడు . . .

మహిమై కాఫీతో వచ్చింది.

"ఏం ఆలోచన? ముందు కాఫీ తాగండి; సరిగ్గా వేడిగావుంది," అని చెప్పి ఆ వచ్చిన ఉపచార పత్రాలు చదవ సాగింది; మధ్య మధ్య ఆగి, తలెత్తి, గర్వంతో భర్తని చూసి హర్షించింది.

"అవన్నీ నిజమని నమ్మకు. 'నువ్వు మరి ఉద్యోగంకి రావద్దు!' అని అంటే నేను ఏడుస్తానని అవన్నీ రాసిపెట్టారు - పంచదార మిఠాయిలాగ . . . "

"అది నాకు తెలుసు . . . కాని అందరూ నిజమే రాసారు . . . మీరు ఎవరినీ కొట్టలేదు, తిట్టలేదు - అది నిజం."

"హూం . . . వీళ్ళేదో గొప్పగా కనిపెట్టినట్టు . . . " అని అతను ఉపేక్షతో భార్యమాటలు తోసిపేసారు.

"దాన్నే సమర్ధత అని వాళ్ళు అంటున్నారు; అదీ నిజమే. బెత్తం వాడకుండా, బొబ్బలు పెట్టకుండా, మంచి పేరు సంపాదించడం కష్టం కాదా?"

అనుకూలసామి ఆలోచించారు. అదీ నిజమేమో? గర్వపడానికి హక్కు తనకీ ఉందని అతనికి అనిపించింది.

"అదేం కష్టం కాదు. పాలది, పనిమనిషి దగ్గఱకూడా అలాగే ఉండవచ్చు. మనిషిగా పుట్టినవాడెవడూ హింసకి సమ్మతించడు."

"అందరికీ అది సాధ్యం కాదండి!"

"అదేమో, నేనలాగానే జీవితమంతా గడిపేసాను," అన్నారతను.

"సార్!" అని ఎవరో గుమ్మంనుంచి తలుపు తట్టారు.

"ఎవరు?"

"నేనేనండి!"

మహిమై వెళ్ళి తలుపు తెరిచింది.

"సార్ ఉన్నారా?"

"ఉన్నారు . . . ఎవరది? . . . ఓ, ఆరుముగమా . . . రా . . . "

ఆరుముగం మాత్రం రాలేదు; ఇంకొక పిల్లవాడుకూడా వచ్చాడు - అతని క్లాసులో చదివే అబ్బాయే. వాళ్ళతోబాటు ఒక స్త్రీ కనిపించింది. ఆవిడకి నలభై, నలభైరెండేళ్ళుండవచ్చు, తల, చెవులు, ముక్కు, చేతుల్లో ఏ ఆబరణాలూ లేవు.

అనుకూలసామి లేచి నిలబడ్డారు.

"చిన్నయ్యా, ఏంటి సంగతి?"

"ఈవిడ చిన్నయ్యన్ తల్లి సార్!" అని ఆరుముగం స్త్రీని పరిచయం చేసాడు.

"రండి!"

ఆరుముగం ఎవరితోనైనా వచ్చాడంటే శిఫారసుకని అర్థం. ఇరవైమూడు సంవత్సరాలైనా వాడింకా స్కూల్లో చదువుతున్నాడు. వాడికి లీడరులాంటి ఒక అంతస్తు వుంది. ఇప్పుడు ఎందుకు వచ్చాడో? పరీక్షపేపర్లుకూడా ఏవీ లేవే!

"ఏంటి ఆరుముగం?"

"చిన్నయ్యన్ కి మిమ్మల్ని చూడాలట సార్!"

"ఏంటి సంగతి, చిన్నయ్యా?"

పిల్లవాడు జవాబు చెప్పలేదు. తలవంచుకొని నిలబడ్డాడు. అర నిమిషం గడిచింది. తలెత్తనేలేదు. ఏడ్చాడు.

"చెప్పరా!" అని తల్లి చెప్పింది.

రెప్పవాల్చకుండా అనుకూలసామి పిల్లవాడిని చూసారు.

"చెప్పరా!" అని ఆరుముగం కూడా అన్నాడు.

పిల్లవాడి మొహం చర్మంలో ఒక మలుపు కనబడింది; పెదవులు వణికాయి.

"ఒక సంవత్సరంగా పిల్లవాడు అల్లాడిపోతున్నాడు" అని అంది తల్లి.

"అలాగా? ఒక సంవత్సరంగానా?"

"అవును సార్!" అన్నాడు ఆరుముగం. "ఇక మీరు 'మాటాడవచ్చు' అని చెప్పేయండి సార్!"

"సరిగ్గా చెప్పురా, నీవేం అంటున్నావో నాకు అర్థం కావటం లేదు!"

"సార్ అన్నీ మరచిపోయారు!" అని అంటూ ఆరుముగం ఆ స్త్రీని, మహిమైని చూసాడు.

'నేనేం మరచిపోయాను?' అని అనుకూలసామి ఆలోచించారు; ఏదీ జ్ఞాపకం రాలేదు.

ఆరుముగం అతనికి చెప్పాడు:

"సార్, వీడు పోయిన సంవత్సరం ఇంకొక పిల్లవాడి ఇంగ్లీషు పుస్తకం దొంగలాడి, తన పేరు దానికి అంటించి, బజారులో సగం వెలకి అమ్మేసాడు. నేనే అది కనిపెట్టి వాడ్ని మీ ముందు తీసుకొచ్చాను."

పిల్లవాడు వెక్కి వెక్కి ఏడవడం ఆరంభించాడు. "ఊరుకోరా, ఏడవకు," అని తల్లి ఊరడించింది.

"ఆ తరువాత?"

"మీరు వాడ్ని కొంతసేపు అలాగే చూసారు. 'మన క్లాసులో ఇంతవరకూ ఎవరూ ఇటువంటి పని చెయ్యలేదు. ఇక మీరెవరూ వీడితో మాటాడకండి' అని అన్నారు."

పిల్లవాడు ఇంకా ఏడుస్తూనేవున్నాడు.

"ఆ రోజునుంచి మేం వాడితో వాటాడడం మానుకున్నాం. మాకు వాడితో ఏ పొత్తూ లేదు. ఆ తరువాత ఇవాళ మేం పార్టీ చేసాంకదా, దానికోసం అందరిదగ్గరా ఒకటీ, రెండని డబ్బు వసూలుచేసాం. వీడూ ఒక రూపాయి ఇవ్వాలని వచ్చాడు. వద్దని చేప్పేసాం, పార్టీకి రావొద్దని అన్నాం. నిన్న మరేం అనక వెళ్ళిపోయాడు. ఇవాళ నేనిక్కడ వచ్చిన తరువాత ఇంటికి వెళ్ళినప్పుడు మా ఇంటి వసారాలో వాళ్ళ

అమ్మగారితో కనిపించాడు. ఆవిడ కూడా నాతో మాటాడారు; తీసుకువచ్చాను" అని భయంతో తడబడుతూ మాటాడాడు.

అనుకూలసామికి ఇప్పుడు ఆ సంఘటన జ్ఞాపకం వచ్చింది: 'నేనెందుకు ఇంత కఠిన శిక్ష విధించాను?' అని అతను బాధపడ్డారు. 'నేనేదో అన్నాను, అందుకని ఈ పిల్లకాయలు ఇంత ఖచ్చితంగా మాటచెల్లించాలా?' అని అంగలార్చుకున్నారు.

"ఒరే చిన్నయ్యా, ఏడవకు!" అని పిల్లవాడిని ఓదార్చారు.

"మేమందరం వాడితో మాటాడవచ్చు అని మీరు చెప్పండి సార్!"

"ఒక సంవత్సరంగానే పిల్లవాడు ఏదీ పట్టించుకోడంలేదు. ఇంతకుముందు అందరితోనూ నవ్వుతూ అన్నీ మాటాడేవాడు. ఇప్పుడు అలాగేంలేదు. ఏదో ఒక మాట మాటాడి, మరేం అనక వెళ్ళిపోతాడు. వాడి మనసులో ఏముందో ఎవరికి తెలుసు? చెల్లెళ్ళతోకూడా ఏదీ మాటాడడం లేదు. ఇవాళ సాయంకాలం నాకన్నీ చెప్పాడు. ఇంట్లో మరెవరు పిల్లలు లేరు. అందరూ ఆటలకి బయటకి వెళ్ళిపోయారు. మాష్టరుగారిని ఇవాళ తప్పకుండా చూడాలన్నాడు. అందుకే నేను వచ్చాను. మీరు పెద్దబుద్ధితో వాడికి చెప్పండి."

అనుకూలసామి సెత్తుటిచేతులతో చిక్కుకున్నారు; అతని మనసు పురుగులాగ గిజగిజలాడింది.

"పిల్లవాడిని పార్టీలో కలుసుకోవద్దని అనేసారు. మీ చేతులతో వాడిచ్చేది తీసుకోండి. మరి అందరూ మీకు మర్యాద చేస్తూంటే వాడి మనసు ఊరుకుంటుందా? ఒరేయ్, ఇవ్వరా . . . " అని తల్లి అంది.

పిల్లవాడు ఏడ్పు ఇంకా ఎక్కువైంది. చెయిలో చెమట కారుతున్న ఒక రూపాయి నోటుని అతనికి అందించాడు.

మరేం అనక అతనది తీసుకున్నారు.

"చాలా మంచి పిల్లవాడు సార్! ఆ రోజు ఏదో మతిపోయి తప్పుచేసాడు . . . ఆ తరువాత వాడిమీద ఎటువంటి ఫిర్యాదు లేదు."

"మీరే పెద్దబుద్ధితో వాళ్ళకి చెప్పండి. తక్కిన పిల్లలు మాటాడకపోతే వీడేం చేస్తాడు?వాళ్ళకేం తెలుసు? చిన్న పిల్లలేకదా?" అని ఆవిడ మళ్ళీ అంది.

“ఈ పిల్లలిలాగ చేస్తారని నాకెప్పుడూ అనిపించలేదే?” అని అతనన్నారు.

“మీరు ఏం చెప్పారో అదే వాళ్ళు చేసారు” అని మహిమై చెప్పింది.

“అవును, నిజం,” అని అతను తేలికగా నవ్వారు, కాని ఏడ్పే నవ్వులాగ వచ్చింది. గోడమీద కనిపించే ముళ్ళకిరీటం అతని తలని ఒకసారి పొడిచింది.

********